క్లుప్తంగా

ఉత్తమ బీఎల్‌వో రజనీ
గవర్నరు చేతులమీదుగా పురస్కారం



పొన్నూరు: మండల పరిధిలోని ములుకుదురు గ్రామ సచివాలయం మహిళా పోలీసు ఎస్.రజనీ గ్రామంలోని 258 పోలింగ్ కేంద్రంలో బూత్‌స్థాయి అధికారిణి (బీఎల్‌వో)గా ప్రతిభ కనబరచడంతో ఉత్తమ బీఎల్‌వో పురస్కారం దక్కింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ నుంచి రజనీ పురస్కారం అందుకున్నారు. ఉత్తమ సూపర్‌వైజర్‌గా ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ఉత్తమ బీఎల్‌వోలు ఏఈ కె. దిన హనుమంత నాయక్, డి. దివ్యవాణి, జె. ఫణి ప్రవల్లిక, ఆర్.అనీష్, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరికి ఈఆర్‌వో హరిహరనాథ్, ఏఈఆర్‌వో కె. శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

మస్టర్ నిర్వహణ ఎంతో కీలకం
ఇన్‌చార్జ్ ఏపీవో షేక్ మస్తాన్‌వలి




ప్రత్తిపాడు: ఉపాధి హామీ పథకంలో మస్టర్ నిర్వహణ ఎంతో కీలకమని ఇన్‌చార్జ్ ఏపీవో షేక్ మస్తాన్‌వలి అన్నారు. మండల పరిధిలోని నడింపాలెం పంచాయతీ కార్యాలయంలో గురువారం ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామాల ఉపాధి హామీ మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ సర్వర్‌లో చోటుచేసుకున్న మార్పులు, మొబైల్ హాజరు నిర్వహణ, మస్టర్ నమోదు చేసే విధానాలపై ఏపీవో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ మస్టర్ నమోదు సమయంలో ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. ఉపాధి పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆయా పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, మేట్లుదని అన్నారు. ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు



గుంటూరు రూరల్: అమరావతిరోడ్డు గోరంట్ల గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సీఐగా నిసార్‌బాషా బాధ్యతలు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ నిసార్‌బాషా గురువారం రాత్రి స్థానిక స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడులో విధులు నిర్వర్తిస్తున్న ఎంవీ సుబ్బారావును రేంజ్ వీఆర్‌కు బదిలీ చేయగా, సీసీఎస్‌లో ఉన్న నిసార్‌బాషాను ప్రత్తిపాడుకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన సీఐ నిసార్‌బాషా చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. సీఐకు ఎస్ఐ రవీంద్రబాబుతో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పెదకాకాని సీఐగా వీరాస్వామి బాధ్యతలు



పెదకాకాని: పెదకాకాని పోలీసుస్టేషన్ సీఐగా కె.వీరాస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం పెదకూరపాడు సీఐగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పెదకాకాని వచ్చారు. ఇప్పటి వరకూ పెదకాకాని సీఐగా పనిచేసిన బండారు సురేష్‌బాబు బదిలీపై వెళ్లారు. నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వీరాస్వామిని పలువురు అభినందించారు.

దుమ్మురేపుతున్న గ్రామీణ క్రీడాకారులు



ఖోఖోలో విజేతగా నిలిచిన వట్టిచెరుకూరు బాలుర టీం



ఖోఖోలో విజేతగా నిలిచిన వట్టిచెరుకూరు బాలికల టీం

హోరాహోరీగా నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

ప్రత్తిపాడు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు దుమ్మురేపుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఖోఖో, గొట్టిపాడు జెడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ పోటీలు జరిగాయి.

- ఖోఖో బాలుర విభాగంలో కాకుమాను, గుంటూరురూరల్, వట్టిచెరుకూరు మండలాల టీంలు పాల్గొన్నాయి. ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో వట్టిచెరుకూరు టీం విన్నర్‌గా నిలిచింది.
- ఖోఖో బాలికల విభాగంలో వట్టిచెరుకూరు, గుంటూరురూరల్ మండలాల టీంలు పాల్గొన్నాయి. గుంటూరురూరల్ టీంపై వట్టిచెరుకూరు టీం ఘన విజయం సాధించి విజేతగా నిలిచింది.
- గొట్టిపాడులో జరిగిన క్రికెట్ ఫస్ట్ రౌండ్ పోటీల్లో ఒక మ్యాచ్‌లో గుంటూరురూరల్, ప్రత్తిపాడు-3 టీం తలపడ్డాయి. నువ్వా, నేనా అన్నరీతిలో సాగిన మ్యాచ్‌లో గుంటూరురూరల్ టీం జయభేరి మోగించింది.
- అనంతరం జరిగిన సెమీస్‌లో పెదనందిపాడు, కాకుమాను టీంలు తలపడగా, పెదనందిపాడు టీం విజయం సాధించింది.
- తొలుత పోటీలను ఎంపీడీవో ఏ శ్రీరమ్య ప్రారంభించగా, మండల స్పోర్ట్స్ నిర్వాహకులు డేవిడ్‌రాజ్‌కుమార్ టాస్ వేశారు.

బాలోత్సవ్ వేడుకలను జయప్రదం చేయండి

వేజెండ్ల(చేబ్రోలు): గుంటూరు హిందూ కళాశాలలో ఫిబ్రవరి 17,18 తేదీలలో జరిగే జిల్లా బాలోత్సవ్ వేడుకలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు కోరారు. చేబ్రోలు మండలం వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం బాలోత్సవ్ బ్రోచర్లను ప్రధానోపాధ్యాయులు విజయశ్రీ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలకు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందిస్తే పిల్లలు మేధావులవుతారన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బట్టీ, హోంవర్క్ హోరు, ర్యాంకుల జోరులో బాల్యం ఒత్తిడికి గురవుతున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లా బాలోత్సవ కమిటీ పిల్లల పండగ బాలోత్సవ వేడుకలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బాలోత్సవాలలో సారస్వత అంశాలు, సంగీతం, రంగస్థలం, నృత్యం, లలిత కళలు, సంప్రదాయ కళలు వంటి ఆరు విభాగాలలో మొత్తం 33 అంశాలలో పిల్లలు పాల్గొనవచ్చన్నారు. ఫిబ్రవరి 13 లోపు స్వయంగా కానీ, ఈమెయిల్ ద్వారా, కానీ వాట్సాప్ ద్వారా కానీ ఎంట్రీలు పంపవచ్చని తెలియజేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అన్నపూర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవ్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, తదితరులు

ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్



గుంటూరు రూరల్: వర్క్‌షాపులు నిర్వహించటం వల్ల విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. నగరశివారుల్లోని లాం నందున్న కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ టెక్నిక్స్ ఇన్ డ్రగ్ డెవలప్‌మెంట్ యూజింగ్ కంప్యూటేషనల్ మెథడ్స్ అనే జాతీయ స్థాయి వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ వర్క్‌షాపులో బయోఇన్ఫర్మేటిక్స్, కంప్యూటేషనల్, బయాలజీ, బయాలాజికల్, కెమికల్ డేటా బేసెస్, మాలిక్యులర్ డాకింగ్ తదితర అంశాలను వివరించారు. యూఎస్‌కు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ న్యూరోసైన్స్ రీసెర్చ్ అసోసియేట్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ ఔషధ ఆవిష్కరణలలో గణన పద్ధతులు, సమ్మేళనాలను పరీక్షించటానికి, మోడలింగ్‌లో సిమ్యులేషన్ విజువలైజేషన్ పద్ధతుల ద్వారా సంభవ్య బైండర్‌లను నిర్ణయించటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 50 శాతంపైగా మార్కులు సాధించిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత అంజనేయులు అతిథులను సన్మానించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నంబూరులో తప్పుల తడకగా ఓటరు జాబితా

- బీఎల్వోల బాధ్యతారాహిత్యం
- చనిపోయిన వారి ఓట్లు కాకుండా కుటుంబసభ్యుల ఓట్లు తొలగింపు
- ఆందోళన చెందుతున్న ఓటర్లు
- పట్టించుకోని అధికారులు

పెదకాకాని: నూతన ఓటరు జాబితా తప్పుల తడకగా ఉండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కమిషన్ పదే పదే హెచ్చరిస్తున్నా, ఉన్నతాధికారులు పలు మార్లు ఓటరు జాబితా ఇంటింటి సర్వేపై అనేక సార్లు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నా బూత్‌లెవల్ ఆఫీసర్(బీఎల్వో)ల పనితీరులో మాత్రం ఎటువంటి మార్పు లేదు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా కచ్చితమైన ఓటరు జాబితా తయారు చేయాలని ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపట్టినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా లక్ష్యం నీరుగారిపోతుంది. మండలంలోని నంబూరు గ్రామంలో 18 వార్డుల్లో పంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం 14,775 ఓట్లు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో పొన్నూరు, నిడుబ్రోలు ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది తమ ఓట్లు నంబూరులో ఉన్నాయంటూ ఓట్లు వేస్తున్నారు. దొంగ ఓట్లు వేస్తున్నారని గుర్తించిన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు వారిని అడ్డుకోవడంతో ఘర్షణకు దారితీసింది. అనంతరం నకిలీ ఓటర్లను పోలీసులకు అప్పగించడం జరిగింది. 2021 ఫిబ్రవరి 21న జరిగిన పంచాయతీ ఎన్నికలలో నకిలీ ఓట్లు వేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. ఈ తరహా వివాదాలకు తావులేకుండా ఉండేందుకు చేపట్టిన సర్వే సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పక్కదారి పడుతుంది. నంబూరు 5,6,7,8 వార్డుల్లో 32 ఓట్లు తప్పుగా నమోదయ్యాయి. వాటిలో డోర్ నెంబర్లతో సంబంధం లేకుండా ఉన్న నకిలీ ఓట్లను గుర్తించడం జరిగింది. అలానే 3వ వార్డులో చనిపోయిన, గ్రామంలో లేని వారి పేర్లు 74 తొలగించాలని బీఎల్వోల దృష్టికి తెస్తే, కుటుంబసభ్యుల 53 ఓట్లు తొలగించారు. గ్రామంలో బీఎల్వోగా పనిచేస్తున్న వీఆర్వో తాను చేయాల్సిన సర్వే అసిస్టెంట్ చేత చేయించడం, మరొక వీఆర్వో అన్ని పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్ల సమక్షంలో ఇంటింటి సర్వే చేయాల్సి ఉండగా, కేవలం రెండు పార్టీల ఏజెంట్ల సమక్షంలో సర్వే చేసి జాబితాలో మార్పులు చేర్పులు చేయడం వివాదాలకు దారితీస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిష్పక్షపాతంగా ఓటరు జాబితా తయారు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నూర్‌బాషాల సమస్యలపై వినతిపత్రం

గుంటూరు రూరల్: నూర్‌బాషా దూదేకులను ఇండియన్ హిందూ దూదేకులుగా కాకుండా ఇండియన్ ఇస్లాం దూదేకులుగా శాశ్వత జీవో ఇవ్వాలని కోరుతూ నూర్‌బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.పీర్‌మహమ్మద్ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం మైనారిటీ కమిషన్ చైర్మన్ కార్యాలయంలో ఆయనను కలిసి నూర్‌బాషా దూదేకుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాలు కేవలం మెమోలు మాత్రమే జారీ చేస్తున్నాయని శాశ్వత పరిష్కారం చూపటం లేదని అన్నారు. నూర్‌బాషా దూదేకుల కమ్యూనిటీ రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొనే ప్రధానమైన సమస్యలను మైనారిటీ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షలకుపైగా నూర్‌బాషాలు ఉన్నప్పటికి మైనారిటీ రిజర్వేషన్స్, రాజకీయ ప్రాధాన్యత లేకుండా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి త్వరితగతిన పరిష్కారం దిశగా కృషిచేస్తానని తెలిపారు. అనంతరం మైనారిటీ కమిషన్ చైర్మన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మస్తానమ్మ, ఎంప్లాయిస్ యూనియన్ ట్రెజరర్ షేక్ మస్తాన్, గుంటూరు నగర అధ్యక్షుడు ఆదం షఫీ, జెండా సుభాని, షేక్ రఫీ, మెడికల్ విభాగం సాంబశివరావు, మీడియా నాగుర్‌వలి, గుంటూరు నగర యూత్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.



మైనారిటీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయ ఓటర్ల దినోత్సవం



గుంటూరు రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యతని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ఆవశ్యకతను తెలియజేస్తూ, ప్రజల్లో ప్రతి ఒక్కరికి చైతన్యం కలిగించి, పూర్తి ఓటు హక్కు నమోదు శాతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలతోపాటు విద్యార్థులు ఆయా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. అనంతరం కళాశాల పరిసరాల్లో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఐఐసీ సెల్ కన్వీనర్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎం.సుధాకర్, కె.ఉపేంద్రచౌదరి, డాక్టర్ కె.కొండలరావు, డాక్టర్ ఎం.అనిత అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసు పవిత్ర హృదయ పుణ్యక్షేత్రం 10వ వార్షికోత్సవం నేడు

పెదకాకాని: ఏసు పవిత్ర హృదయ పుణ్యక్షేత్రం 10వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చర్చి కన్వీనర్ కూచిపూడి మోహనరావు తెలిపారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా బిషప్ రెవరెండ్ చిన్నబత్తిని బాగయ్య హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకూ రెవరెండ్ పూదోట నవీన్‌కుమార్ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ఈఆర్‌వో హరిహరనాథ్
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

పొన్నూరు: ప్రజాస్వామ్యంలో ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈఆర్‌వో హరిహరనాథ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 14వ జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు ఏఈఆర్‌వో కె.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఈఆర్‌వో పాల్గొని మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు హక్కు ద్వారా ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు అయి, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈఆర్‌వో మాట్లాడుతూ కళాశాలల్లో యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టినట్లు తెలిపారు. పొన్నూరు నియోజకవర్గంలో 2,25,864 మంది ఓటర్లు ఉన్నారని, రానున్న ఎన్నికలలో అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడులకు లోనుకాకుండా నిర్భయంగా ఓటు వేయాలని కోరుతూ చేబ్రోలు తహసీల్దార్ గోపాలకృష్ణ అందరితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఈఆర్‌వో హరిహరనాథ్

ఓటు విలువ తెలుసుకోవాలి

ప్రత్తిపాడు: ఓటు వజ్రాయుధమని, ఓటు విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటుకు మహత్తరమైన శక్తి ఉంటుందన్నారు. ప్రజాహితం కోరుకునే పాలకుల ఎంపికలో ఓటు ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మాణిక్యరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వృద్ధ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

వీవీఐటీలో జాతీయ ఓటర్ల దినోత్సవం

పెదకాకాని: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషిస్తుందని తహసీల్దార్ పి.రత్నం అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహసీల్దార్ పెల్లూరి రత్నం మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. భారత దేశం లాంటి ప్రజాస్వామిక దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. 40 ఏళ్లగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఓటు హక్కు పొందిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు ఓటు హక్కు సక్రమంగా సరైన మార్గంలో వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు విలువను అందరికీ తెలియపరచి ఓటు నమోదు చేసుకునే విధంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఐఎల్‌జే భక్తసింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

జొన్న రైతులు అప్రమత్తంగా ఉండాలి

చేబ్రోలు: మొక్కజొన్న, జొన్న పంట పొలాల్లో కాండం తొలిచే పురుగు పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లాం ఫాం కీటక శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో గురువారం మొక్కజొన్న, జొన్న పంట పొలాలను పరిశీలించారు. జొన్న పొలాల్లో కాండం తొలిచే గులాబీ రంగు పురుగు, కత్తెర పురుగు ఉధృతిని గమనించారు. పురుగు వ్యాప్తి ఎక్కువగా ఉందని దీని నివారణకు ఎసిఫేట్, క్లోరిపైరిఫాస్, కొరోజిన్, ఫేమ్, ట్రేసర్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. జొన్న పంటకు 30 రోజుల తరువాత, మొక్కజొన్నకు 15 రోజుల నుంచి పై మందులను మార్చి మార్చి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్సీ డీడీఏ పి.రామాంజనేయులు, ఏవో బి.శ్రీనివాసనాయక్, ఏఈవో కె.సునీత, వీఏఏలు బాను రేఖ, ప్రవీణ్‌కుమార్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



జొన్న పంట పొలాలను పరిశీలిస్తున్న లాం ఫాం శాస్త్రవేత్త, వ్యవసాయశాఖాధికారులు

వృద్ధుడికి చేయూత

పెదకాకాని: అందరూ ఉండి అనాథగా మారిన వృద్ధుడిని హెల్పింగ్ సోల్జర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆశ్రమంలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా, ఇబ్రాంబి దంపతులకు ఇద్దరు సంతానం. ఇద్దరినీ పెంచి పెద్ద చేసి వివాహాలు చేశారు. కుమారుడు భార్య పిల్లల్ని వదిలేసి కనిపించకుండా వెళ్లిపోయాడు. కుమార్తె కుటుంబ జీవనం ఇల్లు గడవడం కూడా తెచ్చుకుంటే తినడం లేకుంటే పస్తులు అన్నట్లుగా ఉంది. తాను తినే దానిలోనే తల్లికి పెడుతూ తన వద్దనే ఉంచుకుంటుంది. తండ్రి కరిముల్లా గ్రామంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై వారం రోజులుగా గ్రామ శివారులోని ప్రభుత్వ పాఠశాల వద్ద దయనీయ పరిస్థితుల్లో పడి ఉన్నాడు. స్థానికులు వృద్ధుడి పరిస్థితిని హెల్పింగ్ సోల్జర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు తెలియజేయడంతో వారు పోలీసులు, బాధితుని కుమార్తె సహకారంతో పల్నాడు జిల్లా, మాచవరం మండలంలోని పిన్నెల్లి గ్రామ అమ్మ వృద్ధుల వికలాంగుల ఆశ్రమంలో చేర్పించారు. కార్యక్రమంలో హెల్పింగ్ సోల్జర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు షేక్ జబీఉల్లా, టీం సభ్యులు ఫజల్, అహమ్మద్ పాల్గొన్నారు. దయనీయ పరిస్థితిలో ఉన్న వారి పట్ల జాలి చూపి ఆశ్రమంలో చేర్పించిన ట్రస్ట్ సభ్యులను స్థానికులు అభినందించారు.



వృద్ధుడితో పోలీసులు, హెల్పింగ్ సోల్జర్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు